క్లుప్తంగా

విద్యతోనే సమాజాభివృద్ధి

ఖమ్మంరూరల్: విద్యతోనే సమాజాభివృద్ధి చెందుతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన మల్లీడి రుక్కమ్మ ఇటీవల మృతి చెందగా.. గురువారం ఆమె జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు రూ. లక్ష విలువైన 40 బల్లలను ప్రాథమిక పాఠశాలకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, బి.రమేష్, పుల్లయ్య, వీరభద్రయ్య, కాంగ్రెస్ నాయకులు నాగండ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోశాలకు దాతల సహకారం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరం గొల్లగూడెంలోని ఓం శ్రీకృష్ణ గోశాలకు పలువురు దాతలు పశు గ్రాసం కోసం గురువారం తమవంతు సాయం చేసినట్లు గోశాల బాధ్యులు తెలిపారు. బొగ్గరపు పాపారావు ఒక రోజు గ్రాసం కోసం రూ.12,116 సహకారం అందించగా, అమెరికాలో ఉంటున్న పులిగిల్ల అనిల్‌కుమార్ ఒక ఆవును దత్తత తీసుకుని రూ.18,000 విరాళం అందజేశారని తెలిపారు.

సెల్‌ఫోన్లు అందజేత

ఖమ్మంఅర్బన్: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు వాటిని గుర్తించి తిరిగి అందజేసినట్లు ఖమ్మం అర్బన్(ఖానాపురం హవేలీ పోలీస్) సీఐ ఆర్.భానుప్రకాశ్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫోన్ల యజమానులైన అర్వపల్లి సాయికుమార్, వేరుకుళ్ల శ్రీనులకు అప్పగించారు. ఈమేరకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛతపై ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న తపాలా ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు గురువారం స్వచ్ఛభారత్‌లో భాగంగా స్వచ్ఛత అంశంపై ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకుని వారంలో రెండు గంటలు కుటుంబ సభ్యులను భాగస్వాములను చేస్తూ పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోస్టాఫీస్ పోస్టుమాస్టర్ సుబ్రమణ్యం, పమ్మి వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి

నేలకొండపల్లి: మండల కేంద్రంలో సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం బీజేపీ ఆధ్వర్యాన స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ అవసరమైన చోట వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఈ మేరకు నేలకొండపల్లికి చెందిన పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, సూరపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, వెంకటరమణ, భూలక్ష్మి, హర్షవర్దన్, వేణుబాబు, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ల మార్పు

నేలకొండపల్లి: మండలంలోని అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లను నూతనంగా నియమించినట్లు ఐకేపీ ఏపీఎం సురేందర్‌బాబు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 32 జీపీల్లో ఇటీవల గ్రామ సమాఖ్యల సమావేశంలో నూతన వీఓలను ఎన్నుకుని ఆయా పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లుగా నియమించనున్నట్లు తెలిపారు. గత చైర్మన్ల బ్యాంక్ లావాదేవీల ఖాతాలు రద్దు చేసి, నూతన చైర్మన్లకు ఖాతాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

గురుకుల కళాశాలకు భద్రత కరువు

ఖమ్మంమయూరిసెంటర్: నగరం నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ గురుకుల కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు భద్రత కరువైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ అన్నారు. గురువారం కళాశాలను సందర్శించి సమస్యలపై ఆరా తీసిన సందర్భంగా వారు మాట్లాడారు. గత నెలలో కురిసిన వర్షాలకు కళాశాల ప్రహరీ నేలకూలి సుమారు నెలరోజులు కావొస్తున్న గోడకు రేకులు అడ్డుపెట్టి విద్యార్థుల భద్రతను గాలికి వదిలేస్తున్నారన్నారు. తక్షణమే ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు వినోద్, లోకేష్, త్రినాథ్, మనోజ్ పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కిష్కిందాపురి
వినోద	బ్యూటీ, డెమాన్‌స్లాయర్ ఇలాంటి సినిమా మీరెప్పుడూ చూసుండరు
సాయిరాం	భద్రకాళి
ఆదిత్య	మిరాయ్
శ్రీనివాస	లిటిల్ హార్ట్స్

- ఖమ్మంగాంధీచౌక్

మాయాబజార్లు..

రైతు బజార్లలో వ్యాపారుల మాయాజాలానికి వినియోగదారులు చిత్తవుతున్నారు. రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వంటివి వారే విక్రయించుకునేందుకు ప్రభుత్వం పలు ప్రాంతాల్లో రైతు బజార్లను ఏర్పాటు చేసింది. లక్ష్యం గొప్పగా ఉన్నా.. ఈ రైతు బజార్లలో తామే రైతులమని పలు ఆధారాలు సృష్టించుకొని పలువురు వ్యాపారాలు చేస్తూ వారి ఆధీనంలోకి తెచ్చుకుని ధరల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు(ఫైల్)

రైతుబజార్లలో పొంతన లేని ధరలు

- బోర్డుపై ఒక ధర, విక్రయించేది మరో ధర
- యథేచ్ఛగా సాగుతున్న విక్రయాలు
- నిబంధనలకు వ్యాపారుల తూట్లు
- అదనంగా రూ.20 వరకు బాదుడు

ఖమ్మంవ్యవసాయం: రైతు బజార్లలో వ్యాపారులు చెప్పిందే ధర అన్నట్లుగా విక్రయాలు కొనసాగుతున్నాయి. నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ పక్కన, కొత్త బస్టాండ్ పక్కన సమగ్ర రైతుబజార్, వీడీవోస్ కాలనీలో సమగ్ర రైతుబజార్, త్రీటౌన్‌లోని హర్కారా బావి సెంటర్‌లో రైతుబజార్‌లు నిర్వహణలో ఉన్నాయి. అయితే వీటిల్లో వ్యాపారులంతా సింగికేటుగా మారి నిర్వహణ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వంటి ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయిస్తూ వినియోగదారులను మోసంచేస్తున్నారు.

అమలు కాని బోర్డు ధరలు

జిల్లా మార్కెటింగ్ శాఖ ప్రతి రోజు కూరగాయలు, ఆకుకూరల ధరలను పలు ప్రమాణాల ఆధారంగా నిర్ణయించి రైతు బజార్లలో ఉన్న బోర్డులపై ప్రదర్శిస్తుంది. హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ ధరల ఆధారంగా వ్యాపారులకు కూడా ప్రయోజనం కలిగేలా ధరలు నిర్ణయించి బోర్డులపై రాస్తుంది. హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, రైతుల నుంచి వ్యాపారులు కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసి రైతు బజార్లలో విక్రయిస్తున్నారు. బోర్డులపై రాసిన ధరలతో ప్రమేయం లేకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కూరగాయలను బట్టి ఒక కిలోకు రూ.10 నుంచి రూ.30ల వరకు అదనంగా విక్రయిస్తున్నారు.

వ్యాపారుల జిమ్మిక్కులు

వ్యాపారులు పలు సందర్భాల్లో బోర్డులపై ధరలను తొలగించి వారికి ఇష్టమైన ధరలను రాస్తూ విక్రయాలు చేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇదేమిటని ప్రశ్నిస్తే నాణ్యత అని, బోర్డుపై తప్పుగా రాశారని బుకాయిస్తున్నారు. కొందరు బోర్డుతో తమకు సంబంధం లేదు.. ధరలు పెరిగిపోయాయని దబాయిస్తూ ధరలు పెంచి అమ్ముతున్నారు. ఇక రైతు బజార్లలో తిష్ట వేసిన వ్యాపారులు రైతులు తాము పండించిన పంటను రైతు బజార్లలో విక్రయించుకునేందుకు వచ్చినా తాము చెప్పిన ధరలకే విక్రయించాలని లేదా పంటను తమకు విక్రయించి వెళ్లాలని హుకుం చేస్తున్నారు. కొందరు రైతులు ఆ వ్యాపారుల ఆగడాలను తట్టుకోలేక విక్రయానికి తెచ్చిన సరుకును ఆయా వ్యాపారులకే విక్రయించి వెళుతున్నారు.

విక్రయాల ధరల వివరాలు (కిలో రూ.లలో)

కూరగాయలు	బోర్డు ధర	విక్రయించే ధర
టమాట	28	40
బెండకాయ	16	25
పచ్చిమిర్చి	46	60
కాకరకాయ	30	50
బోడకాకర	120	150
బీరకాయ	50	60
పొట్లకాయ	36	45
చిక్కుడు	56	70
నాటు చిక్కుడు	96	120
గోరుచిక్కుడు	36	50
నాటు దోస	26	35
ఆలుగడ్డ	24	30
చామగడ్డ	30	40
క్యారెట్	46	60
కీరదోస	26	35
బొప్పాయి	40	50
పుచ్చకాయ	30	50



పెవిలియన్ గ్రౌండ్ పక్కన రైతు బజార్

పేరుకే ధరల బోర్డు..



రైతుబజార్లలో ధరల బోర్డులు పేరుకే ఉన్నాయి. ఆ బోర్డులపై ఉన్న ధరలతో సంబంధం లేకుండా ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ప్రశ్నిస్తే ధరలు అలాగే ఉన్నాయని, బోర్డుపై ఉన్న ధరలకు విక్రయించమని చెబుతున్నారు.

– ఎ.వెంకటేశ్వర్లు, వినియోగదారుడు

రోడ్ల వెంట అమ్మేవారే నయం..



రైతు వారీ విక్రయాలు అరకొరగానే ఉన్నాయి. ఇక్కడ వ్యాపారులే కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తున్నారు. రోడ్ల వెంట, ఇండ్ల వద్ద అమ్మేవారి వారి వద్దే ధరలు నయంగా ఉంటున్నాయి. వ్యాపారుల తీరుతో ఆదరణ కోల్పోతున్నాయి.

– విజయలక్ష్మి, వినియోగదారురాలు

'ఉల్లాస్' లక్ష్యం నెరవేర్చాలి



పుస్తకాలు అందిస్తున్న ఎంఈఓ చలపతిరావు

నేలకొండపల్లి: నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు చేపట్టిన ఉల్లాస్ లక్ష్యాన్ని నెరవేర్చాలని ఎంఈఓ బి.చలపతిరావు సూచించారు. గురువారం ఉల్లాస్ కేంద్రాలకు పుస్తకాలను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తొలి విడతలో 15 ఏళ్లకు పైబడిన స్వశక్తి సంఘాల మహిళలు, ఉపాధి హామీ పథకం కూలీలు, ఐసీడీఎస్ లబ్ధిదారులలో నిరక్షరాస్యులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈమేరకు వలంటీర్లకు ఇప్పటికే శిక్షణ అందించినట్లు తెలిపారు. నూరుశాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ ప్రసాద్, వెంకటేశ్వర్లు, పుష్కర్, గ్రామదీపికల సంఘం ప్రతినిధి రాజపుత్ర పార్వతీబాయి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు సన్మానం

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం నుంచి ఖమ్మం రూరల్ మండలంలోకి విలీనమైన కామంచికల్, దారేడు, పడమటితండా గ్రామపంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు చల్లా వెంకటేశ్వర్లు, రాధికలను గురువారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వీరు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కొనసాగుతుండగా.. ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఏపీఓ పద్మయ్యనాయుడు, ఈసీ దీపక్‌లు సత్కరించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూరుగంటి సూర్యం, మండల అధ్యక్షులు బరిగేల కోటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు భద్రు, మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ.. విలీన గ్రామాల్లో మరింత సేవాభావంతో పని చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, రవి, వెంకన్న, నాగల్ మీరా, మస్తాన్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కాపర్ వైరు చోరీ

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరును గురువారం గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. ఈమేరకు రఘునాథపాలెం ఏఈ శంకర్ ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థులైన కిలారు రామారావు, కొండపల్లి జైపాల్‌రెడ్డి విద్యార్థులకు టై,బెల్టులు సమకూర్చగా.. గురువారం ఎంఈఓ బీవీ రామాచారి అందజేశారు. దాతల దాతృత్వాన్ని అభినందించి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, వారికి చేయూతను అందించాలన్నారు. అనంతరం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన పాఠశాలకు టీవీని బహూకరించగా.. ఎంఈఓ ప్రారంభించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రవిందర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు రమాదేవి, నర్సయ్య, నాగేందర్ పాల్గొన్నారు.

మోకాలి మార్పిడి చికిత్స విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉదయ్‌కృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: దీర్ఘకాలికంగా మోకాళ్ల నొప్పితో బాధపడుతున్న ఖమ్మానికి చెందిన లెనిన్ బాబుకు ద్విపార్శ్వ రోబోటిక్ ట్రైటేటరల్ ద్వారా చేసిన మోకాలి మార్పిడి చికిత్స విజయవంతమైనట్లు హైదరాబాద్ యశోద ఆస్పత్రి చీఫ్ కన్సల్టెంట్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఉదయ్‌కృష్ణ మైనేని పేర్కొన్నారు. గురువారం ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలిక మోకాలి నొప్పితో ఆస్పత్రికి వచ్చిన లెనిన్‌బాబు ఆస్పత్రికి రాగా.. అధునాతన స్మిత్ నెఫ్యూ కొరి రోబోటిక్ సిస్టమ్‌ను ఉపయోగించి చికిత్స చేసినట్లు చెప్పారు. కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ ట్రామా, రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ రవీష్ అజ్మీరా మాట్లాడుతూ.. ఉన్నతమైన మన్నిక, తక్కువ బరువు కలిగిన ఆక్సీనియం ప్రొస్థెసిస్ ఇంప్లాంట్ సాయంతో మార్పిడివిజయవంతమైందన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్‌సీఓ

కూసుమంచి/ ఖమ్మంస్పోర్ట్స్/ఖమ్మంసహకారనగర్ : ఇటీవల సర్దార్‌పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల యాజమాన్యాలు పేర్కొన్నాయి. ఈనేపథ్యాన కూసుమంచి మండంలోని మహాత్మా జ్యోతి పూలే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎ.నాగరాజు, ఎస్.విగ్నేష్, ఖమ్మం నగరంలోని శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన సోను, వివేక్, శన్విరెడ్డి, సిరిచందన, శ్రీజ, నవితరెడ్డిలు ఈ నెల 25 నుంచి నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడనున్నట్లు గురుకుల ప్రిన్సిపాల్ పేరబోయిన మల్లయ్య, శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్‌రెడ్డి, శ్రీవిద్య పేర్కొన్నారు. ఈమేరకు పాఠశాలలో విద్యార్థులను అభినందించారు.

కేజీబీవీ వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం అర్బన్: కేజీబీవీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (టీయూసీఐ) డిమాండ్ చేసింది. గురువారం ఖమ్మం అర్బన్ మండల పరిధిలోని కేజీబీవీ యూఆర్‌ఎస్ వద్ద నిర్వహించిన సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆవుల అశోక్ మాట్లాడుతూ.. వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని, పని భారం తగ్గించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులు భర్తీ చేయడంతో పాటు నైట్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా, ప్రభుత్వం అమలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమంలో వర్కర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జ్యోతి, కరుణ, కోటిలింగం, పద్మ, కరుణకుమారి, కృష్ణవేణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలని నిరసన

నేలకొండపల్లి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యాన నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యా రంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం పాలేరు డివిజన్ అధ్యక్షుడు వరుణ్‌కుమార్, మండల అధ్యక్షుడు హరీష్, శీలం ఉమేష్, బోడ వెంకట్, మద్రి సాయి, ప్రవీణ్, రాము తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన శిక్షణా తరగతులు



తిరుమలాయపాలెంలో పాల్గొన్న అంగన్‌వాడీలు

కామేపల్లి/తిరుమలాయపాలెం: పోషణ్ బీ, పడాయి బీ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓలు దయామణి, కవితలు సూచించారు. ఈ కార్యక్రమంలో యూడీసీ రామారావు, సూపర్‌వైజర్లు లలితమ్మ, కృష్ణకుమారి, సావిత్రి, లక్ష్మి, ఉమా, పుష్ప, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అధికారులకు వినతి



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గ్రామంలోని ఇళ్ల మధ్య ఉన్న తన ఖాళీ స్థలంలో సుబాబుల్ మొక్కలు నాటించి కోతులు, పాములను ఆవాసాలుగా మార్చడని ఆరోపిస్తూ గ్రామస్తులు తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్‌లకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇళ్ల మధ్య తోటలను ప్రతిబింబించేలా మొక్కలు నాటకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పండుగ కోటేశ్వరరావు, బైరెడ్డి యుగేందర్ రెడ్డి, పగిడిపల్లి కోటయ్య, బొడ్డు సతీష్, కంకటి సాయి, హెచ్చు ప్రసాద్, వెంకటేశ్వర్లు, సరవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు శాస్త్రీయంగా జరగాలి

ఖమ్మం అర్బన్: ఖమ్మం అర్బన్ మండలంలో ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల సర్దుబాటులో జరిగిన తప్పిదాలను సరిచేయాలని పీఆర్టీయూ మండల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడు గుడిపూడి శ్రీనివాసరావు, కార్యదర్శి బి.రవికిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సర్దుబాటు చేపట్టలేదని, కొన్నిచోట్ల జూనియర్లను కాకుండా సీనియర్లను సర్దుబాటు చేశారని తెలిపారు. ఇకనైనా జరిగిన పొరపాట్లను సవరించి శాస్త్రీయంగా సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎ.దర్గయ్య, ఎస్.సత్యనారాయణ, ఆర్.రంగారావు, అచ్యుతరావు, బి.మురళీకృష్ణ, కె.నవీన్‌కుమార్, కె.వెంకటకుమారి, కరుణ, సునీత, జయ, జ్యోతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

● చెత్త వేసిన వారికి జరిమానా..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ రోడ్డు మీద చెత్త వేయడాన్ని గుర్తించిన మున్సిపల్ అధికారులు ఐదు టూవీలర్ స్పేర్‌పార్ట్స్, మెకానిక్ షాపుల వారికి రూ.7,500 జరిమానా విధించారు. పౌరులు, వ్యాపారులు శుభ్రత పట్ల జాగ్రత్తగా ఉండి, చెత్తను రోడ్లపై వేయొద్దని సూచించారు.

● పారిశుద్ధ్యంపై అవగాహన

కేఎంసీ పరిధిలోని 60 డివిజన్లలో శుభ్రత, పర్యావరణంపై అవగాహన పెంచే కార్యక్రమాలను చేపట్టారు. రహదారి శుభ్రత, డ్రైయిన్లు తవ్వడం, శుభ్రపరచడం, బహిరంగ ప్రదేశాల్లో మొక్కల కత్తిరింపు, నిలిచిన నీటిని తొలగించడం వంటి కార్యక్రమాలను చేపట్టారు.

విలువలతో కూడిన విద్య అందించండి



సదస్సులో మాట్లాడుతున్న స్వాతి

ఖమ్మం మామిళ్లగూడెం: మహిళలు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా విలువలతో కూడిన విద్యను అందించాలని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేత, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ స్వాతి కోరారు. గురువారం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. పాలకులు చిత్తశుద్ధితో మహిళా సాధికారికత కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థినులకు ఫెలోషిప్ పథకం ఇవ్వాలని, ఖమ్మంలో ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మందా సురేష్ మాట్లాడుతూ.. ఇండియన్ లెజెండరీ లీడర్, ఉస్మానియా యూనివర్సిటీ అరుణ తార జార్జిరెడ్డి స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమ బాటలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో జిల్లా నేతలు రాము, పైండ్ల శ్యామల, మన్విత, నర్మద, రాణి, కృష్ణ వేణి, అర్షిత, వైశాలి, తేజస్విని, తేజ తదితరులు పాల్గొన్నారు.


లంబాడీల ఆత్మగౌరవ సభకు తరలిరావాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఓయూ విద్యార్థుల, లంబాడీల ఆత్మగౌరవ వేదిక ఆధ్వర్యాన ఈ నెల 19న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ సభకు ఖమ్మం జిల్లా నుంచి బంజారా బిడ్డలు భారీగా తరలిరావాలని బంజారా అడ్వకేట్ జేఏసీ నాయకులు హరినాయక్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్టీల మధ్య కొంతమంది చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటున్నా.. ప్రభుత్వం స్పందించపోవడం దారుణమన్నారు. అందుకే ప్రతి తండాలో, ప్రతి గ్రామంలో బంజారాలను మేల్కొపేందుకు సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ధరావత్ వీరన్న, ధరావత్ ప్రసాద్, ధరావత్ ఉపేంద్రమ్మ, భూక్యా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

ఖమ్మం అర్బన్: ప్రజాపాలనలో భాగంగా నగరంలోని ఐదో డివిజన్‌లో గురువారం 10 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. డివిజన్ కార్పొరేటర్ పల్లెబోయిన భారతి చంద్రయ్య ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేంద్రసింగ్, దానయ్య, పంతంగి వెంకటేశ్వర్లు, ఏలూరు శ్రీనివాసరావు, రామచంద్ర, విజయ్‌కుమార్, వెంకన్న, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ స్నేహితులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని నయాబజార్ హైస్కూల్‌లో చదివిన పదో తరగతి(1983–84 బ్యాచ్)పూర్వ విద్యార్థులు తన స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. 40 ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్న స్నేహితుల్లో ఒకరైన ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లె(మారెమ్మ గుడి)కు చెందిన కె.శ్రీనివాసరెడ్డి ఇటీవల మరణించగా.. స్నేహితులు స్పందించి తమవంతు సాయంగా రూ.51,500ల నగదును గురువారం మృతిడి కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో నూనె శ్రీనివాస, డాక్టర్ వెన్నా దేవేందర్, రాయపూడి శ్రీధర్, నేరెళ్ల శ్రీనివాస్, దుర్గేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'భద్రత' సవాల్..



చైతన్యనగర్‌లో వాటర్ ట్యాంక్‌పై ఉన్న కోతులు



ఇందిరానగర్ రోడ్డులో వీధి కుక్కల గుంపు

- దడ పుట్టిస్తున్న కోతులు, కుక్కలు
- ప్రతిఘటించిన వారిపై దాడులు
- బయటకు రాలేక జంకుతున్న జనం

ఖమ్మంఅర్బన్: ఒకవైపు కోతుల బెడద.. మరోవైపు వీధి కుక్కల ఉన్మాదంతో ప్రజలు నలిగిపోతున్నారు. ఎంతలా అంటే కనీసం ఒంటరిగా బయటకు రాలేనంతగా వణుకుపుట్టిస్తున్నాయి. రోజువారీగా బయటకు వెళ్లే మహిళలు, చిన్నారులు చేతిలో ఏదైనా సంచి కనిపిస్తే చాలు కోతులు లాగేసుకోవడం, ప్రతిఘటించిన వారిపై దాడులు జరపడం, ఇళ్లలోకి చొరబడి తినుబండారాలను ఎత్తుకెళ్లడం వంటి ఘటనలు పెరుగుతూనే ఉన్నాయి. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన కోతులు ఇప్పుడు గుంపులుగా నగరంలో సంచరిస్తూ భయపెట్టిస్తున్నాయి.

వారే టార్గెట్..

ఇక కుక్కలు ప్రతి వీధిలో గుంపులుగా తిరుగుతూ ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. చిన్నారులు స్కూల్ బస్సులు ఎక్కే సమయాన, మహిళలు కిరాణా కోసం వచ్చిన సమయాన ఇవి టార్గెట్ చేయడం సహజమైంది. ముఖ్యంగా నగరంలోని ఇందిరానగర్ కాలనీ, చైతన్యనగర్, రోటరీనగర్, శ్రీనగర్‌కాలనీ, టేకులపల్లి, మధురానగర్, వరదయ్యనగర్, ఖానాపురం, బల్లేపల్లి, పాండురంగాపురం తదితర ప్రాంతాల్లో కోతులు, కుక్కల ఇబ్బందులు తీవ్రరూపం దాల్చాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఇల్లు బయటకు వస్తేనే భయం వేస్తోంది. ఎప్పుడు కోతి దూకుతుందో, కుక్కలు దాడి చేస్తాయో తెలియని పరిస్థితి. చిన్న పిల్లలను బయట ఆడుకోనివ్వలేని స్థితి ఏర్పడింది. మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి'అని పలువురు నివాసులు కోరుతున్నారు. నగరాభివృద్ధితో పాటు ఇలాంటి సమస్యలను పరిష్కరించకపోతే ప్రజల జీవన భద్రతే సవాల్‌గా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతుల పట్టివేత, వీధి కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.